


ఎట్టకేలకు అమ్మ చెరువుకు మోక్షం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని అమ్మ చెరువుకు కబ్జాదారుడి చెర నుంచి ఎట్టకేలకు మోక్షం లభించింది. అమ్మ చెరువు సర్వే నెం.13/ఎల్పీఎం పరిధిలో ఉన్న 41.74 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఎవరూ ప్రవేశించరాదంటూ శుక్రవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గతంలో ఈ చెరువు భూమిని వెంకటగిరికి చెందిన ఓ వ్యక్తి అధికార పార్టీ అండ చూసుకొని సుమారు ఎకరా మేర ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశాడు. స్థానిక అమ్మ చెరువు గ్రామ నివాసిగా ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు చెరువు ఆక్రమణ పై పలుమార్లు రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేశారు. పరిష్కారం కాకపోవడంతో చివరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ చర్యలకు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు అమ్మ చెరువులో గ్రామ సభను ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించేందుకు తీర్మానించారు. చెరువు భూమిని కాపాడటంలో శక్తి మేరకు పోరాడిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.


మూడు నెలల వేతనాలివ్వకనే...

కార్మికుల పట్ల పరిశ్రమల యాజమాన్య ధోరణి ఇటీవల కాలంలో మితిమీరిపోతోంది.. శ్రమదోపిడీ చేయడమే గాక, ఉన్నపళంగా కంపెనీని మూసివేస్తూ, కార్మికులను రోడ్డున పడేస్తున్నారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితి కార్మికులది. తాజాగా ట్రాక్‌షూ కంపెనీ యాజమాన్యం మూడు నెలలుగా వేతనాలివ్వకనే, ఉన్నపళంగా కంపెనీని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో 350 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఉద్యోగ భద్రత లేక, కుటుంబాలను ఎలా గడుపుకోవాలో అర్థంకాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను ఉన్నపళంగా వీధినపడేస్తే ఎలా అని సిఐటియు ప్రశ్నిస్తోంది.

'షూ'.. గప్‌చిప్..మూసివేత

- రోడ్డునపడ్డ 350 మంది కార్మికులు
- 'ట్రాక్‌షూ' కంపెనీ యాజమాన్య ధోరణి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

వరదయ్యపాలెం మండలం కురుంజలం పంచాయతీలో ట్రాక్‌షూ లెదర్‌కంపెనీ ఉంది. 15ఏళ్ల క్రితం చెన్నయ్‌కి చెందిన ఓ పారిశ్రామికవేత్త ఈ పరిశ్రమను ప్రారంభించారు. కల్లివెట్టు, తలారివెట్టు, బుచ్చినాయుడుకండ్రిగ, కుక్కంబాకం, వరత్తూరు, నెలవాయి, ఎన్టీఆర్ నగర్ తదితర గ్రామాల నుంచి ఈ కంపెనీలో పనిచేసేవారు. 350 మంది పనిచేస్తుండగా, 300 మంది మహిళా కార్మికులే కావడం గమనార్హం. అయితే స్థానికంగా ఉన్న రాజేంద్ర అనే వ్యక్తి కార్మికులను వేధింపులకు పాల్పడేవాడని తెలుస్తోంది. ఒక్కరోజు సెలవుపెట్టినా మూడు రోజుల వేతనం కట్ చేసేవారని తెలుస్తోంది. కుటుంబ పోషణ కోసం ట్రాక్‌షూ కంపెనీలో 15ఏళ్లుగా 350 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరితో రోజుకు 10 గంటలు పని చేయించుకుంటూ 8000 రూపాయలు జీతం ఇస్తామని నమ్మబలికి 6వేల రూపాయలు ముట్టజెప్పేవారు. పిఎఫ్‌ను వీరి జీతంలో కట్ చేస్తున్నారు తప్ప, కంపెనీ నుంచి జమ చేసిన పరిస్థితి లేదని తెలుస్తోంది. చేసేది గొడ్డుచాకిరీ అయినా కుటుంబం కోసం పది గంటల పాటు పనిచేసేవారు. ప్రస్తుతం కంపెనీ నష్టాల్లో ఉందని ఉన్నపళంగా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా షూ కంపెనీని మూసివేయడంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒక్కరోజు సెలవు పెడితే 2వేల నుంచి మూడు వేల వరకు అటెండెన్స్ కటింగ్ అని కోత పెట్టేవారు. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ అని కేవలం అరగంట సమయం మాత్రమే ఇచ్చేవారు. కంపెనీకి డెలివరీ ఆర్డర్ వస్తే ఓటీల పేరుతో రేయింబవళ్లు వెట్టిచాకిరీ చేయించుకుంటూ ఓటి అని చెప్పి సదరు ఓటిని రికార్డు పూర్వకంగా నమోదు చేసుకునేవారు కాదు. ఓటి డబ్బులు ఇస్తారని నెలంతా ఎదురుచూసిన కార్మికులకే సింగిల్ పైసా ఇచ్చేవారు కాదు. నెల చివరిలో మొండిచేయిచూపేవారు.

ఉద్యోగ భద్రత ఏది..?

మెలుగు రమేష్, సిఐటియు, సత్యవేడు



ట్రాక్ షూ పరిశ్రమలో ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనం లేదు. ఓటీ లేదు. ఒకరోజు సెలవు పెడితే రెండు రోజులకు సంబంధించిన జీతాన్ని రాజేంద్ర కట్ చేస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారు. అనేకమార్లు కార్మికులు అడిగినా నిర్లక్ష్యపు సమాధానం తప్ప కార్మికుల యోగక్షేమాలు పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా మూడు నెలల వేతనాలను కార్మికులకు అందించి, కంపెనీ సజావుగా నడిచేలా చర్యలు తీసుకోని పక్షంలో కార్మికులు చేసే ఆందోళనకు సిఐటియు మద్దతు ఉంటుంది.

అర్హులందరికీ ఇళ్లస్థలాలివ్వాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా
- ఆరు నెలల్లో కేటాయిస్తామని ఆర్డీవో హామీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తూ..

తిరుపతి అర్బన్ మండల పరిధిలో ఉన్న ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని ప్రజలకు గతంలో 2,740 మందిని రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా గుర్తించి, సర్వే చేసి పట్టాలు మంజూరు చేసింది. అయితే వారికి ఒక్కరికీ ఇంటి స్థలాలు చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణులకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తామని ప్రకటించింది. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలైనా స్థలాలు చూపలేదని తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేదలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ పాలకులు మారుతున్నారు తప్ప, ప్రజల స్థితిగతులు ఏమాత్రం మారడం లేదన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇస్తామని గత ఐదేళ్లుగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలను ఊరించి, స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనైనా ఇస్తారని చూస్తుంటే అధికార పార్టీ జెండాలు మోసిన వాళ్లకు, టిడిపి అనుచరగణానికి తప్ప ఇంకెవరి గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. 2024 లో ఎన్నికలకు మునుపు స్థానికంగా ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని తిరుమల నగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్ వద్ద ఉన్న సర్వేనెంబర్ 195/2, సర్వేనెంబర్ 195/4 లో 41 ఎకరా ప్రభుత్వ భూమిలో స్థానికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో చేసిన పోరాటం సందర్భంగా అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన పులివర్తి నాని మన ప్రభుత్వం అధికారులకు వస్తుంది. రాగానే ఈ స్థలంలోనే స్థానికులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని నమ్మబలికారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత 100 రోజుల విజయోత్సవ సభను మంగళం హైస్కూల్లో ఏర్పాటు చేసిన సందర్భంగా సిపిఎం బందం వెళ్లి కలిస్తే తుడా క్వార్టర్స్ వద్ద ఉన్న భూమిలోనే స్థానిక ప్రజలకు ఎన్టీఆర్ గహాలు కట్టి ప్రజలందరికీ ఇస్తామని దాదాపు 1000 మంది సమక్షంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన హామీ ఇచ్చి 15 నెలలు పూర్తవుతున్నా స్థానికంగా ఉన్న పేదలకు ఏ ఒక్కరికీ సెంటు జాగా ఇవ్వలేదన్నారు. అధికార పార్టీకి పనిచేసినటువంటి కార్యకర్తలకు ఆక్రమించుకోవడానికి స్థలాలు ఇచ్చారు తప్ప, స్థానికంగా నిజమైన అర్హుడికి పేదవాడికి ఒక్క ఫ్లాట్ కూడా కేటాయించలేదన్నారు. మంగళం ప్రాంతంలో అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కబ్జాదారులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప పట్టించుకునే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. అర్హులైన పేదలకు స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ధర్నా కార్యక్రమం వద్దకు ఆర్డీవో విచ్చేసి తుడా క్వార్టర్స్ దగ్గర ఇచ్చిన హామీ మేరకు అర్జీలు ఇచ్చిన అందరినీ పరిశీలించి ఆరు నెలల్లోపు వీలైనంత తొందరలో ఇంటి స్థలాలు ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్, నేతలు ఎన్ మాధవ్, పి బుజ్జి, ఎం నరేంద్ర, ఎం జయంతి, మునిరత్నం, మోదిన్, చల్లా చిన్న వెంకటయ్య, బాదుల్లా, లోకయ్య, హమీద్, వెంకటేష్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

అల్యూమినియం పరిశ్రమలో అగ్ని ప్రమాదం


- 8 మంది కార్మికులకు అస్వస్థత
- ముగ్గురి పరిస్థితి విషమం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/ఏర్పేడు

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం రాజులపాలెం సమీపంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వెల్డింగ్ చేస్తుండగా పైపు నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు వ్యాపించాయి. గ్యాస్ కు తోడు అగ్నికీలల ధాటికి పరిశ్రమలో పనిచేస్తున్న ఎనిమిది మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. వివరాల్లోకి పోతే.. రాజులపాలెం సమీపంలో ఉన్న సీఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమలో సుమారు 226 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 150 మంది కార్మికులు స్థానికేతరులు కాగా, 50 మంది స్థానికులు. పాత అల్యూమినియం వ్యర్థాలను కరిగించి ముడి అల్యూమినియం ముద్దలను తయారు చేయడం పరిశ్రమలో జరుగుతున్న తంతు. అయితే శుక్రవారం పాత అల్యూమినియం వ్యర్థాలను కరిగించేందుకు వినియోగించే గ్యాస్ పైపు లీకేజీ కావడంతో దాన్ని వెల్డింగ్ చేస్తుండగా ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. మంటలు పైకప్పుకు అంటుకోవడంతో భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగసి పడ్డాయి. సుమారు పరిశ్రమ సగభాగం వరకు పై కప్పు కాలిపోవడంతో మంటలు, పొగ దావానంలా వ్యాపించాయి. గ్యాస్, మంటల ధాటికి ఎనిమిది మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి కిందపడిపోయారు. వీరిని 108 సాయంతో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. శ్రీకాళహస్తి నుంచి మూడు ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేశాయి. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం పై కప్పు మాత్రమే మంటల ధాటికి కాలిపోయిందని వివరణ ఇచ్చారు. అగ్ని ప్రమాద సంఘటన తెలుసుకున్న శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సిఐటియు నాయకులు రంగయ్య హుటాహుటిన పరిశ్రమ వద్దకు చేరి అగ్ని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే తరచూ పరిశ్రమలో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. సీఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమ అగ్నిప్రమాదంపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పందించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంకిత (21) (భర్త పేరు పాండు, బిఎన్ కండ్రిగ) ఎంజిఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రేణిగుంట అమర ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.


చికిత్స పొందుతున్న కార్మికులు


భద్రతా చర్యలు లేవని నిలదీస్తున్న రంగయ్య


ఆర్డీవో పరిశీలన

క్షతగాత్రులు వీరే...

అంకిత (21), గురవమ్మ (50), వెంకటమ్మ (30), మధుప్రియ (30), ప్రియ (26), వైభవ్ దుబాయ్ (22), హైమావతి , తేజేశ్వరి, అశిష్‌కుమార్ (22) గాయపడ్డారు.

గ్రామపంచాయతీలో క్లష్టర్లు రద్దు

- ✓ వందల సంఖ్యలో కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు
- ✓ పంచాయతీల సవరణ బిల్లు క్యాబినెట్లో ఆమోదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



రాష్ట్రంలోని గ్రామపంచాయతీలలో గతంలో అమలు చేసిన క్లస్టర్ విధానాన్ని రద్దు చేస్తూ, ఇకపై నాలుగు గ్రేడ్లుగా పంచాయతీలను విభజిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. క్లస్టర్ విధానంలో ఉన్న 7244 పంచాయతీలు రద్దయి, మొత్తం 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా పరిగణించబడేలా నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ ఆమోదం పొందిన పంచాయతీల సవరణ బిల్లు త్వరలో జీవో విడుదలయితే తిరుపతి జిల్లా పరిధిలో వందల సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు లభించనున్నాయి. క్యాబినెట్ ఆమోదంతో కమిటీ సిఫార్సుల మేరకు రుర్బన్ పంచాయతీలు, గ్రేడ్ - 1, గ్రేడ్ - 2, గ్రేడ్ - 3 మొత్తం నాలుగు గ్రేడ్లుగా పునర్వర్గీకరణ చేయనున్నారు.

పంచాయతీ సెక్రటరీల పోస్టుల అప్ గ్రేడేషన్ ....

పంచాయతీ సెక్రటరీల పోస్టుల అప్ గ్రేడేషన్ లో భాగంగా 359 గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీలకు వేతన స్కేలు రూ. 44, 570 నుంచి రూ.1,27,480 రూపాయలు, రుర్బన్ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ (పిడిఓ)లకు వేతన స్కేలు రూ.45,830 నుంచి రూ.1,30, 580 రూపాయలుగా నిర్ణయించి డిప్యూటీ మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ కేడర్లుగా అప్ గ్రేడ్ చేయడం జరిగింది. మిగిలిన పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ఐదు గ్రేడ్ల నుండి మూడు గ్రేడులుగా మార్పు చేశారు.

కొత్తగా రుర్బన్ పంచాయతీలలో.....

నూతనంగా ఏర్పాటు కానున్న రుర్బన్ పంచాయతీలలో మెరుగైన పాలన కోసం అప్ గ్రేడ్ లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్గ్రేడేషన్ లో భాగంగా 359 జూనియర్ అసిస్టెంట్/ జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్ పోస్టులకు వేతన స్కేలు రూ.25,220 నుండి రూ.80, 910, సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు వేతన స్కేలు రూ.34,580 నుండి రూ.1,07,210 గా నిర్ణయించారు. పంచాయతీ సెక్రటరీ పోస్ట్ పేరును పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ గా మార్పు చేశారు.

నిబంధనల అమలు, అదనపు బాధ్యతలు

గ్రామ పంచాయతీలలో బిల్డింగ్, లేఅవుట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడానికి సర్వేస్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను, కంట్రీ ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమించి, వారి రెగ్యులర్ విలేజ్ సెక్రటేరియట్ విధులు నిర్వర్తించాల్సి ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. మినిస్ట్రీయల్, ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టుల మధ్య పదోన్నతి మార్గాన్ని ఆమోదించడం, రెండు క్యాడర్లకు సమాన అవకాశాల కోసం సర్వీస్ రూల్స్ లో సవరణలను చేశారు.

ఇంటర్ కేడర్ లో....

ఇంటర్ కేడర్ లో పదోన్నతి పొందిన వారికి రెండు వారాలపాటు సంస్థాగత శిక్షణ, ఒక సంవత్సరం పాటు ఆన్ జాబ్ శిక్షణ, మినిస్టీరియల్ సిబ్బందికి ఫీల్డ్ అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ లో శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా నియమితులైన డిప్యూటీ మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ఫౌండేషన్ శిక్షణ పూర్తయిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటుగా రుర్బన్ పంచాయతీలలో పిడివోలుగా సేవలందించాల్సి ఉంటుందని, పరిపాలన ప్రక్రియలను డిజిటల్ లైజ్ చేయడానికి డెడికేటెడ్ ఐటి విభాగం నెలకొల్పి సర్వేస్ డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని వినియోగించి వర్క్ ఫ్లో ఆటోమేషన్, రియల్ టైం పర్యవేక్షణ చేయనున్నారు.

పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం: సుశీలదేవి, జిల్లా పంచాయతీ అధికారి



తిరుపతి జిల్లాలో శుక్రవారం విజయవాడలో క్యాబినెట్ ఆమోదం పొందిన పంచాయతీ సవరణల బిల్లు ద్వారా నూతన పరిపాలన విధానం అమలులోకి వస్తుంది. కొత్తగా ఏర్పడనున్న రుర్బన్ పంచాయతీలలో పూర్తి పారదర్శక పరిపాలన విధానం ఏర్పడుతుంది. దీని ద్వారా వందల మందికి జిల్లా పరిధిలో గ్రేడ్ - 5 నుండి గ్రేడ్ -3కి పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు లభించనున్నాయి. వేతన స్కేలు కూడా పెంపు చేయడం జరిగింది. త్వరలో జీవో విడుదల అవనుంది. అనంతరం జిల్లా పరిధిలోని పంచాయతీలలో అభివద్ధితో కూడిన డిజిటలైజ్ పరిపాలన ప్రజలకు అందించనున్నాం. జిల్లాలోని 774 పంచాయతీలు నాలుగు గ్రేడ్లుగా విభజించి కొత్త రూపు సంతరించుకొనున్నాయి.

శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం

ఇద్దరు విద్యార్థులు దుర్మరణం





ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ పై ద్విచక్ర వాహనం మీద స్పీడుగా వెళ్తూ, అదుపుతప్పి డివైడర్ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చంద్రగిరి నియోజకవర్గం కందుల వారి పల్లికి చెందిన కనిష్క్ (22), కొట్టాల గ్రామానికి చెందిన వాస్తవ కామినేని (22) రంగంపేట వద్ద ఉన్న శ్రీ విద్యానికేతనంలో డిగ్రీ చదువుతున్నారు. శుక్రవారం ఇరువురూ కలిసి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్‌లో తిరుపతిలోని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ పై ప్రయాణించారు. లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో బైకు పై అతి వేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఫ్లై ఓవర్ పై నుంచి కింద పడ్డారు. తీవ్ర రక్త గాయాలు కావడంతో ఇరువురూ అక్కడికక్కడే మతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ 2.0 ఎగ్జిబిషన్‌లో గృహోపకరణ స్టాల్స్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలు 2.0 లో భాగంగా తగ్గిన జిఎస్టి రేట్లకు అనుబంధంగా తిరుపతి శిల్పారామంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ కు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం జరిగిన ఎగ్జిబిషన్ లో వంటకు సంబంధించిన గహ వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, కార్లు, స్కూటర్లు, సోలార్, ఇతర వస్తువులకు సంబంధించి సుమారు 30కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను రీజనల్ జీఎస్టీ ఆడిట్, ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయ అడిషనల్ కమిషనర్ కే నాగేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎస్టీని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించడం జరిగిందని, వినియోగదారులు తక్కువ ధరలకే వస్తువులు లభిస్తాయి అని అన్నారు. వ్యాపారస్తులు, మహిళ వినియోగదారులతో మాట్లాడి మార్కెట్లో జిఎస్టి తగ్గింపు ధరలను అమలు చేస్తున్నారా లేదా అన్న విషయాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు.. చేనేత హస్తకళల చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, ఏపీ బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ రాజు, రాష్ట్ర నాయకులు కే వి చౌదరి, వాసవి ఏజెన్సీ అధినేత ఏ వి రమణ కుమార్ పాల్గొన్నారు

అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి : టిటిడి ఈవో

ప్రజాశక్తి- తిరుపతి సిటీ



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయం అయిన నేపథ్యంలో అదే స్ఫూర్తితో తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత సమీక్ష సమావేశం శుక్రవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఎటు చూసినా ఈసారి అనూహ్యంగా సానుకూల వాతావరణం కనిపించిందని టిటిడి ఈవో తెలిపారు. భక్తులకు టిటిడి కల్పించిన సౌకర్యాలపై గ్యాలరీలు, క్యూలైన్లలోని భక్తులు 100 శాతం సంతప్తిని వ్యక్తం చేశారన్నారు. బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆహ్వానించేందుకు వెళ్లిన సమయంలో సిఎం పలు సూచనలు చేశారని, టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు, పాలక మండలి సభ్యులు, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ విభాగం, టిటిడిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం, శ్రీవారి సేవకుల సేవలు, భక్తులు, మీడియా సమిష్టి సహకారంతో విజయవంతం అయ్యాయన్నారు.

అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు ప్రణాళికాబద్ధంగా సౌకర్యాలు కల్పించేలా మూడు నెలల ముందు నుండే మార్గదర్శిని రూపొందించామన్నారు. అనివార్య కారణాలతో రాలేకపోయినా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు కాన్ఫరెన్స్ లతో సమీక్షించుకున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ భక్తుల రద్దీని నియంత్రించేందుకు క్యూలైన్లు ఏర్పాటు, టిటిడి, విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో పనిచేశారన్నారు. ఈ ఏడాది టెక్నాలజీ సేవలను బాగా సద్వినియోగం చేసుకున్నామన్నారు.

సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నాగలాపురం

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో అరుణానది తీరాన ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీలపూడి గ్రామానికి చెందిన పద్మనాభరాజు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా సత్యవేడుకు చెందిన కృష్ణయ్యయాదవ్, ఇరుగుళం గ్రామానికి చెందిన జయంతి, కన్నవరం వాస్తవ్యురాలు దేవి, కెవిబిపురం మండలానికి చెందిన కవిత, సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి చెందిన హేమంత్‌కుమార్, సురుటుపల్లి గ్రామానికి చెందిన హంస, నాగలాపురానికి చెందిన నెల్సన్ మండేల, శ్రీనివాసులు, నాగభూషణమ్మ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేసన్ ఎక్స్అఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం రాత్రి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు.



సురుటుపల్లి ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యుల ప్రమీణ స్వీకారం



'అమర'లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - రేణిగుంట

తిరుపతిలోని అమర ఆస్పత్రిలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సెరికావా టకేశి మరో అరుదైన అత్యంత కష్టతరమైన శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ గుండెకు సంబంధించి రక్తనాళాలు పూర్తిగా వందశాతం మూసుకుపోయి, రాయిలాంటి కాఠిన్యాన్ని సంతరించుకున్న మూడు క్లిష్టమైన కేసులను, కాంప్లెక్స్ ప్రొసీజర్ ద్వారా విజయవంతంగా సరిజేశారు. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సెరికావా టకేశి ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఆయనతో పాటు డాక్టర్లు వెంకట శివకృష్ణ హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ గురజాల, అమర ఆస్పత్రి బృందం డాక్టర్ నౌషాద్ సంయుక్తంగా పాల్గొన్నారు.

ఎంబియూలో 'మోహన్‌మంత్ర'

ప్రజాశక్తి - చంద్రగిరి

ఎంబియూ విద్యాసంస్థలో ఏటా వైభవంగా నిర్వహించే విద్యార్థులు సాంస్కృతిక వేడుక 'మోహన్ మంత్ర' శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యాసంస్థల అధినేత మంచువిష్ణు మాట్లాడుతూ కళాశాలపై తనకు ఎంత హక్కు ఉందో విద్యార్థులకే అంతే హక్కు ఉందన్నారు. మోహన్‌మంత్ర భారతదేశంలో అత్యంత ముఖ్యమైన ఫెస్టివల్‌గా గుర్తించారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పుత్తూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ, గ్రామీణ ఏఈలు జైసాయి, భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శారీరక శ్రమతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - పాకాల: శారీరక శ్రమతో మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాకాల మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొగరాలలో 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'ను పురస్కరించుకొని విద్యార్థులలో మానసిక ఆరోగ్యాన్ని పెంచే చదువుపై ఒత్తిడిని తగ్గించడం, అవసరం మేరకు మొబైల్ ఫోన్స్ వాడకం , ఆరోగ్య వంతమైన జీవనశైలికి మార్గాలు అన్నారు. నిద్ర ఆవశ్యకత, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి అనుకూల పరిస్థితులు, మానసిక ఆందోళనలను తగ్గించే మార్గాలు అన్నారు. ఆరోగ్య వంతమైన సంపూర్ణ ఆహారం, సామాజిక బంధాలకు మద్దతు నిచ్చే వ్యవస్థల గురించి, టీచర్ కౌన్సెలర్ వసపర్తి వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సుమలత, ఉపాధ్యాయులు సుల్తాన్, బాబు, రామమూర్తి, నీరజ, ప్రమోదిని, సీఆర్పీ మునికృష్ణ, ఆశా వర్కర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ మాట్లాడుతూ మానసిక దైర్యంతో బాధపడుతున్న వారికి తగిన సలహాలు, సూచనలు అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భారతి, బార్ ప్రెసిడెంట్ ఉమా శంకర్, సీనియర్ అడ్వకేట్ గోపీకృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు, ఎస్ఐ తిరుపతయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జీఎస్‌టీపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఆరోగ్య శాఖ తరపున ప్రతి సచివాలయంలో ప్రజలకు జీఎస్‌టీపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుచ్చి నాయుడు కండ్రిగ పంచాయతీ ఉప సర్పంచ్ కె మునిరాజా అధ్యక్షతన సెక్రెటరీ జి పెంచలయ్య, ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జీఎస్ రావులు కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ లో భాగంగా గ్రాండ్ ఎలక్ట్రానిక్ సేల్ ఎగ్జిబిషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, గూడూరు సబ్ కలెక్టర్ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. స్థానిక గాంధీ బొమ్మ నుండి ర్యాలీ నిర్వహించి, ఎగ్జిబిషన్ ను ప్రారంభించి, ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సేల్ టాక్స్ ప్రాక్టీషనర్ కోటా సునీల్ కుమార్, సోమిశెట్టి చెంచు రామయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు నివాళులు


నాగభూషణంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ఎస్ కానిస్టేబుల్ కె నాగభూషణంకు పలు వురు శుక్రవారం నివాళులర్పించారు. అధికారులు, వెస్ట్ పిఎస్ సిఐ, అసోసియేషన్ సభ్యులు కలసి నగరిలో ఆయన స్వగృహం వద్దకు వెళ్లి నాగభూషణం మృత దేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు వున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యమిచ్చారు తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వివిధ రకాల ఫండ్ల ద్వారా రెండు లక్షల రూపాయలు పోలీసు డిపార్ట్మెంటు ద్వారా వారి కుటుంబానికి అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన భౌతిక కాయానికి సుబ్రహ్మణ్యం నివాళులు అర్పించారు.

టిడిపి నాయకుడికి సన్మానం


కట్టా వెంకటరమణారెడ్డి దంపతులు

ప్రజాశక్తి-నాయుడుపేట: కట్టా వెంకట రమణారెడ్డి, సురేఖ రెడ్డి దంపతులకు నాయుడుపేటకు చెందిన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. నాయుడుపేట పట్టణ టిడిపి నాయకులు కట్టా సుకాంత్ రెడ్డి, సురేఖ రెడ్డి దంపతుల పెళ్లిరోజు వేడుకను పురస్కరించుకుని శుక్రవారం ఆయనను పలువురు నాయకులు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని మాతృశ్రీ అపార్ట్మెంట్ లోని టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి నివాసంలో శుక్రవారం వారి పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు,మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టిడిపి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

టపాకాయల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల పరిధిలోని కార్తికేయ ట్రాకర్స్ , సునీల్ ట్రాకర్స్ దుకాణాలలో తహశీల్దారు జరీనా, పుత్తూరు అగ్నిమాపక ఇన్‌చార్జ్ గిరిధర్, ఎస్ఐ ధర్మారెడ్డి, సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయల దుకాణాల లైసెన్స్ రెన్యూవల్, ఫైర్ సేఫ్టీ, దుకాణం డిస్ప్లే, ఇతర తనిఖీలు నిర్వహించారు. దీపావళి నేపథ్యంలో దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని టపాసుల దుకాణాలను స్థానిక తహసీల్దార్ కటారి జయ జయరావు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం కోట మండలంలోని విద్యానగర్, వెంకన్న పాలెంలో ఉన్న టపాసుల దుకాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. టపాసుల దుకాణాలలో ఉండాల్సిన నియమ నిబంధనలు ను తప్పక పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు కృష్ణ, సుబ్రహ్మణ్యం, అగ్నిమాపక శాఖ అధికారి కె శ్రీనివాసులు, వినాగరాణా, దుకాణదారులు పెంచలస్వామి పాల్గొన్నారు.


కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దాడి, హర్యానాలో ఎస్సీ ఐజీపై హర్యానా బిజెపి ప్రభుత్వం వేధింపులను నిరసిస్తూ కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ చర్యలు చాలా దారుణమన్నారు. వీటిని కేంద్ర ప్రభుత్వం అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యర్రపల్లి గోపి గౌడ్, రవి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: నూతన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విద్యాభివృద్ధికి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించడంలో నూతన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మేడ్జ్ పాఠశాలలో పది రోజుల శిక్షణ ముగించుకున్న నూతన ఉపాధ్యాయులకు ఎంచుకున్న పాఠశాలలలో విధులు నిర్వహించేందుకు పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు.

నూతన ఉపాధ్యాయుల శిక్షణ, కౌన్సెలింగ్ ముగింపులో విద్యాశాఖాధికారి పిలుపు


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న నూతన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ పారదర్శకతగా నిర్వహించినట్లు డీఈవో కేవిఎన్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసి, కౌన్సెలింగులో ఎంపిక చేసుకున్న పాఠశాలలకు ఉపాధ్యాయ విధులకు హాజరయ్యేందుకు పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు. మండలం సి రామాపురం కపంచాయతీ, కోదండ రామాపురం వద్ద ఉన్న మేడ్జ్ స్కూలులో 2025 మెగా డీఎస్సీలో ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 450 మంది ఉపాధ్యాయులకు శిక్షణను ఈనెల మూడవ తేదీ నుండి 10వ తేదీ వరకు నిర్వహించారు. నూతన ఉపాధ్యాయులందరూ పోస్టింగులు పొందిన పాఠశాలలో ఈనెల 13వ తేదీ జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు కేబీఎన్ కుమార్, ఉప విద్యాశాఖ అధికారిణి ఇందిరా దేవి, ఎంఈఓ లు జయవేలు, భాస్కరయ్య శుభాభినందనలు తెలిపి పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం


మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి- వాకాడు: మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్తు శూన్యమని, మత్తు పదార్థాల వాడకం వల్ల భవిష్యత్తు అంధకారం అవుతోందని మెరైన్ సీఐ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ శివ సౌమ్య, ప్రిన్సిపాల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుచ్చినాయుడు కండ్రిగలో అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 8వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి, అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు సముద్రాల నందకుమార్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలలో భాగంగా అమ్మా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా అనాథ విద్యార్థులకు నగదు సాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. నంద కిషోర్ అనాథలైన 48 మంది విద్యార్థులకు నగదు సాయం అందించారు. ఉత్తమ విద్యార్థులు ఐదుగురికి, క్రీడల్లో రాణించిన ఒక విద్యార్థికి వెండి పతకం అందించారు. యూట్యూబ్ ఆర్గనైజర్ రమణ గోగుల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే కంప్యూటపై అవగాహన పెంచుకొని మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంచు రమణయ్య ,సముద్రాల మాధవరావు , విజయబాబు , సురేంద్ర రావు, భవిత ,నిత్యానంద ,దివ్యనంద ,గురునాథం రాష్ట్ర కార్యదర్శి , కే ఈశ్వరయ్య , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి: సీఐ



ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని కొంత మంది అక్రమార్కులు లాభాలను ఆశించి సుదూర ప్రాంతాల నుండి బాణ సంచాను, వాటి తయారీ ముడి పదార్థాలు కొనుగోలు చేసి నివాస ప్రాంతాలలో నిల్వ చేయడం, కొంత మంది నివాస గృహాలనే బాణసంచా తయారీ కేంద్రాలుగా నిర్వహిస్తున్నారన్నారు. బాణసంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచినా తయారుచేసినా విక్రయించినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా సుమతి జన్మదినం


కేక్‌కట్ చేస్తున్న టిడిపి నాయకురాలు సుమతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఆలం సుమతి జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, తల్లి బృందమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సుమతి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలకు స్వీట్లు పంచి పెట్టారు. మహిళా కార్యకర్తగా సుమతి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

భక్తులకు అన్నదానం

.ప్రజాశక్తి -చంద్రగిరి : శ్రీనివాస మంగాపురం కనకదుర్గమ్మ ఆలయంలో స్థానిక గ్రామస్తులు అన్నదానం ప్రారంభించారు. అమ్మవారికి అర్చనలు అభిషేకాలు చేసి, అమ్మవారి ఎదుట నినాదాలు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం అమ్మవారి ఎదుట నైవేద్యం సమర్పించి అన్నదానాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భూముల పంపకంలో వివాదం

ప్రజాశక్తి- చిట్టమూరు: కుమ్మరపాలెంలో కొంతకాలంగా ప్రభుత్వ భూములను పంచుకునే విషయంలో గ్రామస్తులు మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు తహశీల్దారు దృష్టికి తీసుకు రావడంతో శుక్రవారం చిట్టమూరు తహశీల్దారు ఎం నరేష్ కుమ్మరపాలెంలో విఆర్ఓ భక్తవత్సల రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ సభను ఏర్పాటుచేసి సర్వే నంబర్ 16 లో ఉన్న 27 ఎకరాల ఆరు సెంట్ల ప్రభుత్వ భూమి సాగు విషయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే 145 సెక్షన్ విధించి సదరు భూమికి అర్హులను గుర్తించి వారికి పట్టాలు ఇస్తామన్నారు. అలా జరగకుండా ఉండాలంటే సామరస్యంగా సమస్యలు పరిష్కరిం చుకుని వ్యవసాయం సాగు చేసుకోవాలని లేకుంటే ఆ భూమిలో ఎవరూ వెళ్లకూడదని వీఆర్ఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో డిటి నిరంజన్ కుమార్, ఆర్ఐ సుధా, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



ప్రజాశక్తి -తిరుమల: టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ శుక్రవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు ఆయన తిరుపతిలోని అదనపు ఈవో బంగ్లాలో అదనపు ఈవో సిహెచ్‌వెంకయ్య చౌదరికి విరాళం డీడీ అందించారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించాలని పుత్తూరు మున్సిపల్ కమిషనరు యం మంజునాథ్. ఆధ్వర్యంలో వివిధ శాఖాధిపతులు, ఎంఈఓ, ప్రైమరీ హెల్త్ సెంటర్, పీహెచ్ మెడికల్ ఆఫీసర్స్, సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, పారిశుధ్య , పర్యావరణ, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లతో కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక శిక్షణనివ్వాలని వార్డు ఆరోగ్య కార్యదర్శులకు సూచించారు.

జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో రాయితీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : జిల్లాలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు , జూనియర్ కళాశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం .ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరేంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.స్పందించిన కలెక్టర్ వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డిఇఒ, ఆర్ఐఒలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ వై కోటేశ్వరబాబు, జిల్లా సహాయ కార్యదర్శి తారక, జర్నలిస్టులు సురేష్, పురుషోత్తం, విసి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గేదెలు మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు మండల పరిధిలోని పారిచర్ల రాజు పాలెం లో విద్యుత్ వైరు తగిలి గేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాడి రైతు హరినాథ్ రాజు కి చెందిన గేదెలు మృతి చెందాయి. సుమారు వీటి విలువ 80 వేల వరకు ఉంటుందన్నారు. అధికారులే న్యాయం చేయాలని తెలిపారు.అనంతరం గూడూరు తహసీల్దారుకి వినతి పత్రం అందచేశారు.

ఎస్‌వియూను అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యం

- ఉపకులపతి ఆచార్య నరసింగరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న విసి నరసింగరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌వియూను అగ్రస్థానంలో వుంచడమే తమ లక్ష్యం అని శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య తాతా నరసింగరావు అన్నారు. మధ్యాహ్నం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గా పనిచేసి , ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీలో అనుబంధ ఆచార్యులుగా పనిచేస్తున్న వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఎస్వీయూ నూతన ఉపకులపతిగా మూడు సంవత్సరాల కాలపరిమితో నియమించింది. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తనకు అవకాశం రావడం అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా విసిని వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, డీన్లు, శాఖాధిపతులు, ఇంజనీర్ , బోధన బోధనేతర సిబ్బంది వారిని కలిసి అభినందించారు.

దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సిపిఎం


సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన దళితులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెస్ట్ వరవతూరు దళితవాడ వాసులకు వారి స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలాలను అగ్రకులస్తులు ఆక్రమించుకుంటున్నారని దీన్ని అడ్డుకుని వెంటనే వారికి పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి నలుగురు రమణయ్య కోరారు. అగ్రకులస్తులు ఆక్రమించిన స్థలంలో దళితులు సిపిఎం నాయకులతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా దళితులు వెస్ట్ వరవత్తూరు రెవెన్యూ సర్వే నెంబరు 112లో సుమారు మూడు ఎకరాల 75 సెంట్లు భూమిని చెట్టు, పుట్ట బాగుచేసి తమ స్వాధీనంలో భవిష్యత్తులో ఇళ్ల స్థలాలకు ఉపయోగ పడుతుందని గ్రామస్తులు రక్షించుకుంటున్నారన్నారు. అదే భూమిని అగ్రకులస్తులు శ్మశాన స్థలంగా మార్చి దళితుల ఇళ్ల ముందు మృతదేహాలను పూడ్చి వెళుతున్నారని ఈ విషయమై ప్రశ్నింగా 'మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం..మీరు దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పండి..' అని బెదిరించారన్నారు. చేసేదేమీ లేక సిపిఎం నాయకులను ఆశ్రయించారన్నారు. దళితులకు సిపిఎం అండగా వుంటూ పోరాడుతుందన్నారు. వెస్ట్ వరవత్తూరు దళితవాడలో ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివసించాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రస్తుతం అగ్రకులస్తులు ఆక్రమించిన స్థలాన్ని దళితులకు ఇప్పించి న్యాయం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. దళితులకు న్యాయం జరగకుంటే పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తిరుపాలయ్య , సుబ్బయ్య, శంకరయ్య, బాబు, గురవయ్య, నాగూర్, వీరాస్వామి, గంగయ్య, విక్రం వెంకట రమణయ్య రామయ్య మణికంఠ గురవయ్య పాల్గొన్నారు.

సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, క్రమ శిక్షణతో జీవితంలో దేన్నైనా సాధించవచ్చని డాక్టర్ బి చంద్రమౌళి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే కొత్త విద్యార్థులకు కళాశాల గురించి, కొత్త విద్యా విధానమైన సెమిస్టర్ పద్ధతి గురించి, కళాశాల ఉన్నా మౌలిక వసతులు, సౌకర్యాలు, కళాశాల విలువలు, సంస్కృతిని విద్యార్థులు అవగాహన చేసుకోవడానికి స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తును మలుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య, ఐక్యూఏసి కన్వీనర్ డాక్టర్ పి సుజన, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ ఆర్ బి వాణిశ్రీ, డాక్టర్ పి హరిబాబు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వెంకటకృష్ణయ్య, ఏ. నాగేశ్వర రావు తదితర అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో నేరాలు దూరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తతతో వ్యవహరిస్తే సమాజంలో మహిళలపై నేరాలు అదుపులోకి వస్తాయని వన్ టౌన్ సిఐ గోపి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం చట్టాలు– హక్కులు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. చుట్టూ సమాజంలో బాల్య వివాహాలు చోటుచేసుకున్నా, మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు కోట విద్యార్థులు

ప్రజాశక్తి -కోట : 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో భాగంగా శుక్రవారం గూడూరులోని డిఆర్‌డబ్ల్యు కాలేజీ ఆవరణలోని ఎ ఆదిలక్ష్మమ్మ ఆడి టోరియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో కోట మండలం కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు విజయం సాధికారు. గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు పాకం సౌమ్య,వల్లం శ్రీవిద్య లను అభినందించారు.

రాజకీయాలకు వాడుతున్నారు : వైసిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వెదురుకుప్పం మండలం దేవళం పేటలో జరిగిన అంబేద్కర్ విగ్రహ అగ్ని ప్రమాద ఘటనను అధికార కూటమి నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతున్నారని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరే అజయ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రాజేంద్ర, తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు, చెచర్ల మురళి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి కార్మిక రాజ్య బీమా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం శ్యాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బైరాగిపట్టెడ లోని సోక్రటిస్ స్కూల్లో పనిచేసే ఈఎస్ఐ లబ్ధిదారులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. తిరుపతి ప్రాంతీయ ఈఎస్ఐ కార్పొరేషన్ కార్యాలయం, ఈఎస్ ఐ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో ఈఎస్ఐ ఆసుపత్రి డాక్టర్లు జి నాగేంద్ర, జి స్వర్ణ, కార్పొరేషన్ డాక్టర్ కిరణ్ కుమార్, హెడ్ నర్స్ తనూజ నజమాల్, వైద్య సిబ్బంది పి పద్మజ, ఉమా మహేష్, గురు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయ దేవస్థానానికి తిరుపతి తాత నగర్ కు చెందిన జ్యోతి, వాసు నాయుడు దంపతులు శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. జ్యోతి, వాసు నాయుడు లు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ అధి కారులు స్వాగతం పలికారు. ఆ దంపతులకు అమ్మవారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందించారు. జ్యోతి, వాసు నాయు డు దంపతులు ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలను ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఈవో జయకుమార్‌కు చెక్కును అందించారు.



క్రైం న్యూస్

బాలుడు దారుణ హత్య

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం, గాజులమడ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గువ్వల కాలనీలో ఘటనలో ఓ బాలుడు హత్యకు గురైన సంఘటన శుక్రవారం చోటుసుకుంది. మృతుడు శ్రీహరి (14) గా గుర్తించారు. తనను చూసి నవ్వినందుకు కోపంతో సహనం కోల్పోయిన మేస్త్రి అనే వ్యక్తి బాలుడిని హత్య చేసినట్లు సమాచారం. టిఫన్ దుకాణం వద్ద శ్రీహరిని కత్తితో దారుణంగా పొడిచినట్లు సమాచారం. బాధిత బాలుడిని తిరుపతి రుయాకు తరలించేలోపు మృతి చెందాడు. మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పట్టణ శివారు ప్రాంతమైన అరవకొత్తూరు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు కు చెందిన గురవయ్య తన భార్య స్వాతి, ఆరేళ్ల కుమారుడుతో కలిసి శుక్రవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. ఈ క్రమంలో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా అరవకొత్తూరు సమీపంలో టిప్పర్ వెనక నుండి ఢీ కొంది. ఈ సంఘటనలో స్వాతి తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త గురవయ్య, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -సత్యవేడు: గత నెల 19వ తేదీ గంజాయి కేసుకు సంబంధించి రెండో నిందితుడు విజయ్(30)ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి గతంలో మొదటి నిందితుడు శ్రీధర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. సిఐ మురళి నాయుడు కథనం ప్రకారం పై కేసులో రెండవ నిందితుడు విజయ్ అప్పటినుంచి పరారీలో ఉన్నారన్నాడని, ఈ నేపథ్యంలో పుత్తూరు డిఎస్పి రవికుమార్ సూచన మేరకు దీనిపై రెండో పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో సత్యవేడు పట్టణం చెన్నై మార్గంలో దలవాయి అగ్రహారం వద్ద శుక్రవారం ఉదయం రెండో నిందితుడు విజయ్ ను ఎస్ఐ రామస్వామి అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రామస్వామి, పి సి ఈశ్వర్, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

హైవేపై రెడ్ చిల్లీలోడ్ లారీ బోల్తా

ప్రజాశక్తి-తడ: తడ మండలం చేనుగుంట కాలనీ సమీపాన టెలిఫోన్ టవర్స్ వద్ద నేషనల్ హైవే మీద చెన్నై కు వెళ్లే మార్గంలో రెడ్ చిల్లీ లోడ్ లారీ అదుపు తప్పి హైవే పక్కన వున్న హైవే ఎమర్జెన్సీ టెలిఫోన్ ను ఢీ కొట్టి నడి రోడ్డుపై బోల్తా పడింది. లారీ గుంటూరులో లోడ్ చేసుకుని చెన్నై కు వెళుతుండగా శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంఇ. దీంతో నేషనల్ హైవే మీద ట్రాఫిక్ జామ్ రెండు కిలోమీటర్ల దూరం వరకు ఆగిపోయింది. సమాచారం అందుకున్న తడ పోలీసులు హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ జామ్ ఆగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. గాయపడిన డ్రైవర్ ను 108 లో సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ కు సహకరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడిచిన 30 సంవత్సరాలుగా తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్ గా ప్రకటించాలని ఎన్నో పర్యాయాలు ప్రభుత్వాలకు, కమిటీలకు వినతులు ఇచ్చామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బాలాజీ రైల్వే డివిజన్ కు సహకరించాలని బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమాం కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైల్వే పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నేడు స్టేషన్ల ఆధునికరణ, కొత్త రైల్వే ప్రాజెక్టులు, డబ్లింగ్ పనులు, హై స్పీడ్ రైలు ప్రవేశపెట్టి రైల్వేను అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. ఏటా రైల్వేకు సమకూరే ఆదాయంలో తిరుపతి రైల్వే స్టేషన్ నుండి దాదాపుగా రూ.250 కోట్ల రూపాయలు సమకూరుతోందని, ఈ నేపథ్యంలో డివిజన్ ప్రకటిస్తే ఈ ప్రాంత అభివృద్ధి చెందడమే కాకుండా అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలో బాలాజీ డివిజన్ ప్రకటన ఆవశ్యకత ఉన్న అంశమని, దీనిని పరిగణలోకి తీసుకొని సానుకూల నిర్ణయాన్ని ప్రకటించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇందుకోసం 12వ తేదీన కచ్చపి ఆడిటోరియంలో కీలక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశం అనంతరం రూపొందించే కార్యాచరణతో ముందుకెళతామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్కిల్ సెక్రటరీ శ్రీధర్ బాబు, శ్రీధర్, వైయస్ బాబు పాల్గొన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌వి యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ మెన్ జూడో, కరాటే, తైక్వాండో టోర్నమెంటు పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొని ఏడు గోల్డ్ మెడల్స్ జూడో, తైక్వాండో కరాటే పోటీలలో పాల్గొని 10 సిల్వర్ మెడల్స్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైమల్లి కార్జునరావు విద్యార్థులను అభినందించారు.

నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి -రామచంద్రాపురం: నూతన ఉపాధ్యాయులందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విద్యాభివృద్ధికి చేయాలని కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మేడ్ట్ పాఠశాలలో 10 రోజుల శిక్షణ ముగించుకున్న నూతన ఉపాధ్యాయులకు ఎంచుకున్న పాఠశాలలలో విధులు నిర్వహించేందుకు పోస్టింగ్ ఉత్తర్వులను ఆయన అందించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ కెవిఎన్ కుమార్, ఉప విద్యాశాఖ అధికారిణి ఇందిరా దేవి, ఎంఈఓ లు జయవేలు, భాస్కరయ్య పాల్గొన్నారు. నూతన ఉపాధ్యాయులు పోస్టింగ్ ఉత్తర్వులను స్వీకరించి రాత్రి 8 గంటలకు నూతన ఉపాధ్యాయులు స్వగృహాలకు బయలుదేరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలం లోని నిండలి గ్రామం లో శుక్రవారం స్వర్ణ భారత్ ట్రస్ట్ ఎల్ వి ప్రసాద్ కంటి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 122 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా73 మందికి ఆపరేషన్ లు అవసరమని గుర్తించారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వడం తో పాటు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యల్లంటి కృష్ణయ్య, బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు దొమ్మరాజు ప్రశాంతి రాజు, కొందరు వెంకటసుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక రాయల్ చెరువు రోడ్ లోని రాయల్ నగర్ లోని సుధాహా లిటిల్ సిటిజన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూలులో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు హ్యాపీ మైండ్ హెల్తీ లైఫ్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ లైన్ మక్కిన భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ మధు, లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు బండి మధుసూదన రెడ్డి, కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి పురుషోత్తమ నాయుడు, సభ్యులు రామచంద్రారెడ్డి ప్రైమరీ హెచ్ఎం లలిత పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రైతులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):మామూలు అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపుల వలన పంటను నష్టపోయిన రైతులకు అటవీశాఖ ఆధ్వర్యంలో నష్టపరిహార చెక్కులను ఇవ్వడానికి నిర్ణయించారు. శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది కలిసి శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతులు మీదుగా బాధిత రైతులకు చెక్కులను పంపిణీ చేశారు.

బ్రిడ్జిపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి -కోట: కోట మండలంలోని చల్ల కాలువ బ్రిడ్జిపై ఇరువైపులా మట్టి నిల్వ ఉండడంతో స్థానిక వ్యక్తి చిరంజీవి స్పందించి ఇద్దరు కూలీలతో నిల్వ ఉన్న మట్టిని తొలగించారు.ఈ సందర్భంగా బ్రిడ్జిపై ఇరువైపులా మట్టి నిల్వ ఉండడంతో వర్షం వచ్చినప్పుడు రోడ్డుపై వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అంతేకాకుండా మట్టి ఉండడంతో టు వీలర్ వాహనాలు స్కిడ్ అయ్యి ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన స్పందించి ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -చంద్రగిరి : చంద్రగిరి మండలంలోని శ్రీనివాస మంగాపురంలో కనకదుర్గమ్మ ఆలయంలో స్థానిక గ్రామస్తులు అన్నదానం ప్రారంభించారు. అమ్మవారికి అర్చనలు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఎదుట నైవేద్యం సమర్పించి అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిట్టపాలెం పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ రాజా రాయల్, పూల సురేష్, నిరంజన్ ,కుమార్,పత్తి సుబ్రహ్మణ్యం ,బాబి ,చంద్రిక మంజుల , భాను ప్రియ, మహేష్, వేణుగోపాల్ రెడ్డి , గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుచానూరు స్టేషన్ నుంచి రైళ్ల పెంపు

- ప్రయాణికులకు అందుబాటులో రైల్వేస్టేషన్
- రూ.120 కోట్లతో అభివృద్ధి
- రైల్వే సీనీఐ శ్రీకాంత్ వెల్లడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుచానూరు రైల్వే స్టేషన్ ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుపతి తూర్పు రైల్వే స్టేషన్ రైళ్ల తాకిడి అధికంగా ఉండడంతో తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి మరిన్ని ఎక్కువ రైళ్ల నడపనున్నట్లు రైల్వే సీసీఐ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ తిరుపతికి క్లస్టర్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను క్లస్టర్ స్టేషన్‌గా అభివృద్ధి చేసింది అని రైల్వే సి సి ఐ శ్రీకాంత్ అన్నారు. సుమారు రూ.120 కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులు పూర్తిచేసి, దశలవారీగా తిరుచానూరు నుండి రైళ్ల నడపడం ప్రారంభమైందన్నారు. ప్రథమ దశలో చెన్నై, అరక్కోణం దిశలకు రెండు రోజువారీ రైళ్ల తిరుచానూరు నుండి నడుస్తుండగా, సుమారు 10 జతల ప్రత్యేక రైళ్ల కూడా ఇక్కడి నుంచే నడపాలని రైల్వే నిర్ణయించిందన్నారు. తిరుచానూరు స్టేషన్ తిరుపతికి ఆరు కిలోమీటర్లు, రేణిగుంటకు 3 కిలోమీటర్ల దూరంలో ఉండి, భక్తుల రాకపోకలకు సౌకర్యంగా ఉందన్నారు. భవిష్యత్తులో పిట్‌లైన్లు, స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు చేసి, తిరుపతి స్టేషన్‌పై ఉన్న ఆపరేషనల్ ఒత్తిడిని తగ్గించాలనే ప్రణాళికను రైల్వే శాఖ రూపొందిస్తోందన్నారు. దక్షిణ మధ్య రైల్వే తిరుపతి నుంచి నడిచే 10 వారపు ప్రత్యేక రైళ్ల ఇకపై తిరుచానూరు స్టేషన్ నుంచి నడపనున్నట్లు ప్రకటించారు. ఆపరేషనల్ కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. దశలవారీగా అమల్లోకి వస్తుందన్నారు. ఈ మార్పు వల్ల జల్నా, చర్లపల్లి, సికింద్రాబాద్, నాందేడ్ వెళ్లే రైళ్ల ప్రభావితం కానున్నాయన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం రైళ్లు తిరుచానూరులో చేరుకొని బయలుదేరు సమయాలు మార్పినా, మధ్యలోని స్టేషన్ల టైమింగ్స్‌లో మార్పు ఉండదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిసిఐ చలపతి, టిఐ మురళీకృష్ణ, శ్రీనివాస రాజేంద్రుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలోని సౌత్ సెక్షన్, నార్త్ సెక్షన్, మంగళం రూరల్స్, అవిలాల, రాజీవ్ నగర్ సెక్షన్‌లలో 33/11 కె.వి పాలిటెక్నిక్ లోని 33 కె.వి ఇన్కమ్ , 33 /11 కె. వి. శెట్టి పల్లి సబ్ స్టేషన్, 11 కె.వి గెస్ట్ లైన్ ఫీడర్లు మెయింటెనెన్స్, మరమ్మతులు కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తిరుపతి ఆపరేషన్ ఈఈ గంగాధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఏమ్‌సి ఆర్ కాలనీ, అంబేద్కర్ కాలని , గాలి వీధి, అనంత వీధి, మంచాల వీధి, త్యాగరాజ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, సింగలగుంట, వరద రాజనగర్, రామచంద్ర నగర్, ఎన్‌జిఓ కాలనీ, కెటి రోడ్డు, ఖాదీ కాలనీ, సప్తగిరి నగర్, అలిపిరి రోడ్డు, 11 కెవి పికెలే ఔట్, రఘునాథ రెడ్డి కాలనీలో విద్యుత్ సరఎఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎస్‌టివి నగర్, రాజీవ్ నగర్, బిటిఆర్ కాలనీ, టిఎన్ పాలెం, తిరుమల నగర్, పీడీ నగర్, ఆర్‌టిఓ ఆఫీసు, వినాయక సాగర్, వెంకట్ రెడ్డి కాలని, గెస్ట్ లైన్ డేస్ , కెనిపేట, పదిపేట, శ్రీనివాసపురం, పద్మావతీ పురం, సిపిఎండ్ ఆఫీసు, ఆర్‌డిఓ ఆఫీసు సబ్ స్టేషన్, తిరుచానూరు, తోలప్ప గార్డెన్స్, వేదాంత పురం తదితర పరిసర ప్రాంతాల వినియోగ దారులు సహకరించాలని కోరారు.

కాంబ్రిడ్జ్ మన్సూర్ గ్లోబల్ స్కూల్ ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతిలో నూతనంగా ఏర్పా టు చేసిన కాంబ్రిడ్జ్ గ్లోబల్ స్కూల్‌ను తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక విమల్ రోడ్ లోని ఎంటవర్స్ లో ఏర్పాటు చేసిన స్కూల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరం నుంచి పది సంవత్సరాల వయసు వరకు స్కూలు, టేక్ కేర్ ను నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. ఉద్యోగం చేసే మహిళలు తమ పిల్లల భద్రత కోసం ఇది ఎంత ఉపయోగ పడుతుందన్నారు. యూకే బెస్ట్ తో, ఇంటర్నేషనల్ ఎక్సైజ్ ప్రోగ్రాం, సెంట్రలైజేడ్ స్కూల్, పిల్లల భద్రతకు పూర్తి భరోసా అందిస్తుందన్నారు. నిత్యం సీసీ కెమెరాల నిఘాలో స్కూల్ నడుస్తుందని, తమ స్మార్ట్‌ఫోన్ ద్వారానే పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు లైవ్లో చూసుకోవచ్చని తెలిపారు. ఆ స్కూల్ చైర్మన్ కే.జీ. ప్రదీప్ మాట్లాడుతూ ప్రైమరీ నుంచి ఐదవ తరగతి వరకు ఈ స్కూల్లో అత్యధిక సౌకర్యాలతో, ఆటపాటల మధ్య చదువులు కొనసాగించేలా ఇక్కడ వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ డిప్యూటీ కమిషనర్ హరిత, అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తపాలా ఉద్యమ జాతీయ నేత, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజిడిఎస్‌యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పోస్ట్‌మెన్ ఎం టిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే మురళి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తి ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద తపాలా సిబ్బంది నిరసన, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటైన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహదేవయ్య నాయకత్వంలోని ఏఐజిడిఎస్ యూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె జరిగిందని చెప్పారు. ఆ సమయంలో



నిరసన తెలుపుతున్న తపాలా శాఖ ఉద్యోగులు

నాలుగు రోజుల పాటు కొనసాగిన ఈ సమ్మెను తపాలా శాఖ ఉన్నతాధి కారులు హామీ ఇచ్చిన అనంతరం నిలిపివేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ఆ సమ్మెకు నాయకత్వం వహించినందుకే మహదేవయ్య పై కక్షపూరితంగా చార్జిషీట్ జారీ చేసి, 2025 అక్టోబర్ 8న ఉద్యోగం నుండి తొలగించడం దారుణమన్నారు. ఈ దారుణ చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ ఎఫ్ పి ఈ), ఏఐజిడిఎస్‌యూ పిలుపు మేరకు శుక్రవారం దేశ వ్యాప్తంగా అన్ని తపాలా కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు, జి మురళీధర్, పి. కిరణ్ కుమార్, విజయ్ కృష్ణ, ఆర్ముగం పాల్గొన్నారు.

గూడ్స్ లారీ ఢీ

తండ్రి, కూతురుకి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -రేణిగుంట:తిరుపతి కడప జాతీయ రహదారిలోని పాత రేణిగుంట వద్ద శుక్రవారం గూడ్స్ లారీ ఢీకొని తండ్రి, కూతురుకు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. రేణిగుంట లోని పాత చెక్‌పోస్టు వద్ద కాపురం ఉంటున్న మధుసూదన్ కుమార్తె దీన బిటెక్ చదువుతోంది. రోజులాగే కాలేజీకి తన ద్విచక్ర వాహనంపై తీసుకు వెళతుంటుంది. గూడ్స్ లారీ వెనకనుంచి ఢీకొనడంతో తండ్రి కూతుర్లకు తీవ్రగాయాలు అయ్యాయి. కూతురు దీన పరిస్థితి విషమంగా ఉందని అక్కడున్న వారు తెలిపారు. వెంటనే తిరుపతికి తరలించారు.

పాకాల రైల్వే స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి- పాకాల: అమృత మహోత్సవంలో భాగంగా పాకాల రైల్వే స్టేషన్లో గుంతకల్ డివిజన్ రైల్వే అధికారి సిరి చంద్రాస్ గుప్త శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పాకాల లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి -కాట్పాడి మధ్య డబుల్ లైన్ ఏర్పాటుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే ప్రారంభించాలని ఇందుకు అవసరమైన స్థల సేకరణ మరియు ఫ్లై ఓవర్ నిర్మాణము వెంటనే చేపట్టాలని ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వాటిని అధికమించి పనులు సత్వరమే ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్లో ఒకటి,రెండు, మూడు ప్లాట్‌ఫాం లేదా నిర్మాణాన్ని పరిశీలించి మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని నాణ్యతలో ఎలాంటి భేషరతులకు పోకుండా చూడాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించబోయే మిగిలిన ప్లాట్ ఫారాల స్థల పరిశీలన తో పాటు నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫ్లై ఓవర్ల నిర్మాణంలో తమ స్థలంలో ఉన్న చర్చిలు, మసీదులు అడ్డంకులుగా ఉందని తెలుసుకొని రైల్వే జంక్షన్ కారడం వల్ల ఆక్రమించకోక తప్పదని తెలిపారు. సంబంధిత పాస్టర్లను మజీద్ పెద్దలను పిలిపించి వారితో చర్చించారు .ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ ఉన్నతాధికారులతో కాంట్రాక్టర్లు ఇంజనీర్లు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -కోట : కోటలో బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడం, భారత రాజ్యాంగం మీద దాడి చేయడమేనని వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్, ప్రధాన కార్యదర్శి పాల మల్లి, సహాయ కార్యదర్శి కావాలి వెంకటకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పనబాక హేమంత్, గౌరవ సలహాదారులు మీజూరు శ్రీనివాసులు, బహుజన నాయకులు నవకోటి బాబురావు, సంయుక్త కార్యదర్శులు దార్ల ఏడుకొండలు, కుదురు కోటి, కోశాధికారి పిండి కేశవ జోరుపల్లి తేజ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ సమస్యలు పరిష్కరించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం తుడా టవర్స్ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన వినతుల పరిష్కారం, తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి పాల్గొన్నారు.

పుట్‌పాత్‌లపై బంద్లను తొలగించండి నగరంలోని పుట్‌పాత్‌లపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన షాపులను, బంద్లను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 36 వ వార్డులోని గిరిపురం, రాజన్న పార్కు, రామచంద్ర పుష్కరిణి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ప్లానింగ్ అధికారులు నగరంలోని పుట్ పాత్ లపై ఉన్న షాపులను, బంద్లను తొలగించాలని అన్నారు. ఎవరైనా పుట్ పాత్ లు ఆక్రమించి షాపులు పెడితే అపరాధ రుసుములు విధించాలని అధికారులను ఆదేశించారు. రాజన్న పార్కులో పాడైన ఆట వస్తువులను మరమ్మత్తులు చేయాలని, పెయింటింగ్స్ వేయించి శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.